# "స్వాగతం"

## కథల సంకలనం



శ్రీమతి కె. వాసవదత్త రమణ

# స్వాగతం

| | | | |
|---|---|---|---|
| 1. | నక్షత్ర | 2.5.2012 | 'ఈనాడు' ఆదివారం |
| 2. | పరిష్వంగం | మే, 2012 | 'స్వాతి' మాసపత్రిక |
| 3. | మాయని మమతలు | 10.1.2007 | 'నవ్య' వారపత్రిక |
| 4. | సారే జహాసే అచ్ఛా | ఆగష్టు, 2010 | 'ఆంధ్రభూమి' మాసపత్రిక |
| 5. | వరలక్ష్మి-వంటావిడ | 6.8.2010 | 'స్వాతి' వారపత్రిక |
| 6. | ప్రక్షాళన | 7.3.2011 | 'జాగృతి' పత్రిక |
| 7. | పరిధి | ఏప్రిల్, 2010 | 'స్వాతి' మాసపత్రిక |
| 8. | అపోహ | 29.6.2006 | 'ఆంధ్రప్రభ' ఆదివారం |
| 9. | రసరమ్యం | 12.3.2009 | 'ఆంధ్రభూమి' వారపత్రిక |
| 10. | నాణెం వెనుక | జూలై, 2009 | 'ఆంధ్రభూమి' మాసపత్రిక |
| 11. | మనసున మనసై | మార్చి, 2008 | 'చినుకు' మాసపత్రిక |
| 12. | రీఛార్జి | 12.3.2008 | 'నవ్య' వారపత్రిక |
| 13. | తొలగిన తెరలు | 25.12.2008 | 'ఆంధ్రభూమి' వారపత్రిక |
| 14. | స్వాగతం | 26.6.2011 | 'ఈనాడు' ఆదివారం |

# నక్షత్ర

మలయమారుతం సన్నగా సృజించి వెళ్ళింది.

ఆ తాకిడికి నవ్వుతూ అభినందిస్తున్నట్టుగా తలలూపాయి సుకుమారమైన లతలు, సన్నగా ఇటు అటు వయ్యారంగా కదులుతూ.

రంగురంగుల పూలు సువాసనలు విరజిమ్ముతూ వాతావరణాన్ని మత్తుగా, ఆహ్లాదభరితంగా మార్చాయి. పచ్చటి లాన్‌లో కూర్చుని ఆ అనుభూతులన్ని మాలలు కట్టుకుంటున్నవేళ, 'నక్షత్ర' అన్న పిలుపు అందంగా వినిపించింది. ఆ పిలుపు విని నా హృదయం పులకించిపోయింది. ఊగుతున్న ఊయల సవ్వడి ఆగింది. వెండి పట్టీలతో మెరుస్తున్న పాదాన్ని తన ఒడిలో పెట్టుకుని తన్మయత్వంతో నా వంక చూస్తున్న తేజ కనిపించాడు.

అతన్ని చూసి నా కళ్ళు ఆనందంతో తళుక్కుమన్నాయి. అతని కళ్ళలో కురుస్తున్న ప్రేమ వర్షానికి తడిసిపోయాను. 'నక్షత్ర ఈ పచ్చటి ప్రకృతిలో వనకన్యలా ఉన్నావు', ఆరాధనగా అన్నాడు. నా గుండె వేగంగా ధ్వనించడం నాకు వినవస్తూనే ఉంది.

'నక్షత్ర, ఇక నిన్ను విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేను, మనం వెంటనే పెళ్ళి చేసుకుందాం' ఆరాటంగా అన్నాడు, రెండు చేతులూ నా నడుంచుట్టూ గట్టిగా పెనవేస్తూ. వివశంగా అతని మీదకు వాలాను. కాలం అలాగే స్థంభించిపోయింది.

❖❖❖

రాత్రి దొరికిన ఆ డైరీ చదువుతుంటే నాకు గట్టిగా నవ్వొచ్చింది. దాదాపు అన్ని పేజీల్లో ప్రేమ కవిత్వాలు, కన్నీళ్ళ విరహాలే, డైరీ పక్కకి పడేసాను. ఇలాంటి విషయాలు సినిమాల్లో, కథల్లో, నవలల్లో, ఆ నిముషం చూడటానికి, లేదా చదవటానికి బాగుంటాయి కాని నిజ జీవితంలో అంతటి ప్రేమలు ఎక్కడైనా దొరుకుతాయా?

సింగపూర్‌లో ఉద్యోగం వచ్చిన సందర్భంలో స్నేహితులందరికి పెద్ద స్టార్ హోటల్‌లో గ్రాండ్‌గా పార్టీ ఇచ్చాను. బయలుదేరేసరికి రాత్రి పదకొండున్నర దాటింది. కారులో సన్నగా వినిపిస్తున్న మ్యూజిక్ వింటూ డ్రైవ్ చేస్తూ ఇంటికి వస్తూంటే కొంతమంది గుంపుగా నా కారు ఆపారు.

'ఏమైంది!' విసుగ్గా అడిగాను కిటికి తెరిచి. 'యాక్సిడెంట్ అయింది' సార్, ప్రక్క సందులోనే హాస్పిటల్ బాగా దెబ్బలు తగిలాయి, కొంచెం డ్రాప్ చేయండి.' ఆదుర్దాగా అడుగుతున్న వాళ్ళ రిక్వెస్ట్ కాదనలేకపోయాను. సరే ఎక్కండి అన్నాను వాళ్ళని హాస్పటల్ ముందు దింపేసి, ఇంటికి వచ్చేసాను.

కారు పార్క్ చేస్తుంటే, వెనక సీట్లో పడి ఉంది ఆ డైరీ, ఆ ప్రక్కనే అందమైన 'తెల్ల గులాబి'. ఆ డైరీ యాక్సిడెంట్ అయిన వాళ్ళదో, లేదా ఎక్కిన వాళ్ళదో అయి ఉండొచ్చు, అలా అని వెనక్కి వెళ్ళి ఆ హాస్పటల్లో డైరీ ఇచ్చేద్దామా అనుకున్నాను. కాని అనవసరమైన రిస్క్ అనిపించింది. పైగా యాక్సిడెంట్ కేసు. ఎందుకు అనవసరంగా కెలుక్కోవడం, 'వృధా' అనిపించింది.

కాని ఎందుకో ఆ డైరీని మటుకు పారేయాలనిపించలేదు. బీరువాలో నా బట్టల మధ్యలో భద్రంగా పెట్టాను. ఆ డైరీలో ప్రేమకథ నన్ను తెలియకుండా వెంటాడుతూ నా మనస్సును ఎక్కడో కదిలిస్తోందేమో, అది నాకు తెలియడం లేదు. నిజానికి నేను ప్రేమ, దోమ లాంటివి బిలీవ్ చేయను. అంతా ట్రాష్గా అనిపిస్తుంది. మా అమ్మా నాన్నాలకి నేను ఒక్కడే కొడుకుని. చిన్నప్పట్నుంచి, ఏనాడు డబ్బుకి లోటు లేకపోవడం వల్ల నా జీవితం చాలా జాలీగా, హ్యాపీగా నడిచింది.

ఫ్రెండ్స్, పిక్నిక్స్, ఎంజాయ్మెంట్ ఇవే నాకు ఆనందం కలిగించేవి ఇప్పటివరకు. కాని ఇవి శాశ్వతమైన ఆనందం కాదని, నాకు దక్కాల్సింది అపురూపమైనది ఇంకేదో ఉందని, నేను సాధించాల్సిన అద్భుతాలు ఇంకా చాలా ఉన్నాయని ఆ క్షణంలో నాకు తెలియదు.

'కాంక్రీట్ జంగల్' సింగపూర్లో నేను చేస్తున్న ఉద్యోగం ఏడాది పూర్తయ్యాక నాకు కలిగిన ఫీలింగ్ అది. 'భూలోక స్వర్గం' నా కొలీగ్ రాకేష్ ప్రతీ రోజూ ఎక్సైటింగ్గా అనే పదం అది. హాట్ గార్ల్స్, హాట్ డ్రింక్స్', ఇంకా ఏం కావాలిరా? అనేవాడు. కాని నాకీ లైఫ్ బోర్ కొట్టేసింది. టైట్ జీన్స్, పొట్టి టీషర్ట్స్, మినీస్, మిడ్డీస్, ఫాస్ట్ లైఫ్ అమ్మాయిలు, విరగబడి నవ్వడాలు, పార్టీలు ఆ కృత్రిమత్వం – రొటీన్ బాగా విసుగొచ్చేసింది.

'ఇంతేనా లైఫ్? తినడం, పడుకోవడం, పార్టీలు, డాలర్లు పోగుచేసుకోవడమేనా? నో వే? నా వల్లకాదు, నాకీ జీవితం నచ్చలేదు. వెంటనే డాడీకి ఫోన్ చేసి చెప్పాను. జాబ్కి రిజైన్ చేస్తున్నానని. ముందు ఆయన చాలా కోపంగా అరిచాడు.

‘బుద్ధుందా నీకు, లైఫ్‌ని మరీ అంత ఈజీగా తీసుకోకు, బంగారంలాంటి జాబ్ వదిలేయకు’ అంటూ చాలా బెదిరించి చివరికి నన్ను బ్రతిమాలడంలోకి దిగాడు.

అమ్మ మటుకు ఎప్పటిలాగానే చాలా మామూలుగా ‘నీకు నచ్చినట్లు చేయరా కిరణ్, నీకు అన్నీ తెలుసులేరా,’ అంది. ‘బై’ అంటూ ఫోన్ పెట్టి ఉద్యోగానికి రిజైన్ చేసి మరో రెండు వారాలకి హైదరాబాద్‌లో వాలిపోయాను. డాడీ నిర్ఘాంతపోయాడు. అమ్మ నన్ను చూసి ముందే ఊహించినట్టుగా ముసిముసి నవ్వులు నవ్వింది.... ఇంట్లో అంతా వారం రోజులు సీరియస్ వాతావరణం.

కొద్ది రోజుల తర్వాత నా బీరువాలో బట్టలు సర్దుతూంటే చాలా రోజులకి మళ్లీ ఆ డైరీ కనిపించింది. ‘నక్షత్ర’... ఆ డైరీమీద స్కెచ్‌పెన్‌తో వ్రాసిన ఆ పేరు మిలమిల కొట్టొచ్చినట్టు మెరుస్తోంది. అంత ప్రేమ ఈ రోజుల్లో ఎవరికైనా ఉంటుందా అనిపించింది. మనస్సులో ఎక్కడో చిన్న కలవరం.

చిత్రంగా ఈసారి నాకా డైరీ చదవగానే నవ్వురాలేదు. అంత అబ్‌సర్డ్‌గానూ అనిపించలేదు. ఆ ప్రేమను ఒక ఇంచి అయినా నాకు చవిచూడాలనిపించింది. ‘నాలో ఈ మార్పు ఏమిటో? ఎందుకో? ఈ బ్యాచిలర్ లైఫ్ మార్పు కోరుకుంటోందో ఏమో?’ పేజీలు తిప్పాను.

✤✤✤

‘ఆకులో ఆకునై, కొమ్మలో కొమ్మనై ప్రకృతిలో మమేకమై నన్ను నేనే మర్చిపోయే ఆనందపు అనుభూతులు ఏవీ నక్షత్ర” అంటాడు ‘తేజ’ కలిసిన ప్రతీసారి ఆవేదనగా. ‘ఏవీ తల్లి నిరుడు కురిసిన హిమ సమూహములు’ కృష్ణశాస్త్రిగారి ఆవేదన నా గుండెను కుదిపేస్తోంది ‘నక్షత్ర’ అంటాడు.

‘వాటి జాడలు, కనుచూపుమేరల్లో లేవు? చల్లదనం, ఆహ్లాదం అన్న పదాల అర్థాలు మారిపోతున్నాయి. ‘భవిష్యత్తులోకి తొంగిచూస్తే, అంతా ఎడారి నిప్పు మంటలలో కాలిపోతున్న స్వప్నాలు గోచరిస్తున్నాయి.’

‘పచ్చదనం కరిగిపోతూ, నలిగిపోతూ ఎక్కడో బాల్కనీల్లో చిన్న మొక్క రూపంలో చిక్కిపోతోంది. మానవత్వం కనుమరుగైపోతూ, స్వార్థం విశ్వరూపమై పోతూ, మంచితనం బిక్కుబిక్కుమంటూ నాలుగుగోడల మధ్య బందీ అయిపోయింది. ఏం సాధించాం? ఎటు పోతున్నాం, నక్షత్ర?’ అంటాడు.

‘చల్లదనాల వనాల నుంచి అగ్నిగోళాల్లోకా? వెన్నెలకాంతుల నుంచి

కృత్రిమపు ఎలక్ట్రిక్ దీపాల్లోకా? వెలుగురేఖల నుంచి చీకటి గుహల్లోకా? 'ఆక్సిజన్ ఊపిరి నుంచి ఓజోన్ చావుకేకల్లోకా? ఏ వైపుకి మన పయనం సాగుతోంది 'నక్షత్ర' అంటాడు.

'తేజ'లో చిన్నతనం, చిలిపితనం మాయమై అతనిలోని మనిషి బయటకి వచ్చి చుట్టువున్న సమాజాన్ని సమూలంగా సంస్కరించాలని ఉబలాట పడుతున్నాడు. అతనిలోని ప్రేమ విశ్వవ్యాప్తమై సమాజానికి చెందటానికి ఆయుత్తమవుతోంది. మూర్తీభవించిన వ్యక్తిత్వంతో నిండిన అతని ఎదుగుదల నిజంగా నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తోంది.

'ఇద్దరం సివిల్స్‌కి ప్రిపేర్ అవుదాం సంథింగ్ వుయ్ షుడ్ డు ఫర్ దిస్ సొసైటీ. ఈ ప్రజల్ని చైతన్యవంతుల్ని చేద్దాం. నా బాటలో కనుక నువ్వు తోడు లేకపోతే నేనేం సాధించలేను. నువ్వు నాతోనే వుంటావు కదా జీవితాంతం' అన్నాడు.

ఆకాశంలో నక్షత్రాలు మిలమిలలాడుతున్నాయి. వెన్నెలంతా మా మీదే పరచుకున్నట్లుగా హాయిగా వుంది. ఆకాశంలో చందమామ, చల్లదనాన్ని పంచుతూ నా ఒళ్లో ఉన్న తేజ రూపంలో తళుక్కుమని మెరిసాడు. నా మదిని దోచాడు. నిశ్శబ్దంగా ముందుకు వంగి అతని నుదిటి మీద ముద్దు పెట్టాను.

✤✤✤

'ఏంట్రా కిరణ్' అమ్మ ప్రక్కన కూర్చుంటూ నా తల నిమురుతూ ఆర్ద్రంగా అడిగింది. డైరీ పక్కకి పెట్టాను. 'అమ్మా చాలా డల్‌గా అనిపిస్తోంది. నా ఫ్రెండ్స్ అందరూ ఉద్యోగాల పేరుతో అమెరికా, ఆస్ట్రేలియా అంటూ దూరంగా వెళ్లిపోయారు. మళ్లీ నేను ఏ చెత్త జాబ్‌లోనో చేరి బోరింగ్ లైఫ్ గడపడం నాకస్సలు ఇష్టంగా అనిపించడం లేదు. ఏం చేయాలో అంతకన్నా తెలియడం లేదు.' నిస్పృహగా తల విదిలిస్తూ అన్నాను.

'పోని పెళ్ళి చేసుకోరాదు' అమ్మ నవ్వుతూ అంది. 'జోకా' చురుగ్గా చూసాను. 'నీ బాధ నాకర్థమైందిరా కిరణ్. నీ మనస్సు మార్పు కోరుకుంటోంది. ఇప్పుడిప్పుడే నీలో ఏదో సాధించాలి అన్న ఆలోచనలు పుట్టుకువస్తున్నాయి. నీలోని కొత్త మనిషి పూర్తిగా బయటికి వచ్చే ప్రయత్నంలో.. ఆ సంధి అవస్థలో ఉన్నావు. డోన్ట్‌వర్రీ.. నీ లైఫ్‌లో ఏదో కొత్త చేంజ్ వస్తుంది.' అమ్మ భరోసాగా ఉంది.

ఇంక రెండు నెలలకి... సివిల్స్‌కి ప్రిపేర్ అవ్వడంలో మునిగిపోయాను.

# సారే జహాసే అచ్ఛా

విమానం గాల్లోకి లేచింది. అది చిన్న పిట్టలా మారి పూర్తిగా కనుమరుగయ్యే వరకు గాల్లోకి చేతులు ఊపుతూనే ఉంది విజయ. ఆమె చెంపల నిండా ధారాపాతంగా కన్నీళ్లు కారిపోతున్నాయి. ఆమె కడుపులో మెలితిప్పినట్టు ఏదో వెర్రి బాధ.

'విక్రమ్ వెళ్ళి చాలా సేపయ్యింది.' తన కళ్లలో కన్నీళ్లు ఆమెకు కనిపించకుండా జాగ్రత్తపడుతూ అన్నాడు సుధాకర్.

'అవును, విక్కి వెళ్లిపోయాడు, మనల్ని వదలి దూరంగా అమెరికా వెళ్లిపోయాడండి. అతని రెండు చేతులు గట్టిగా పట్టుకొని బావురుమంది విజయ.

'ఏమిటి మరీ చిన్న పిల్లలాగ, ఎం.ఎస్ చదవడం కోసం వాడు అమెరికా వెళ్లాడు. అంతేగా, అయినా వాడు అమెరికా వెళ్లి పెద్ద చదువులు చదవాలన్నది నీ కోరికే కదా.'

'ఏమండీ, నా కోరిక నన్నింతగా బాధ పెడుతుందని కాని, నా స్వప్నాలు నిజమవుతూ నాకింత గుండెకోత కలిగిస్తాయని కాని నేనస్సలు ఊహించలేకపోయాను. నా లోకమే విక్రమ్ ఇప్పుడు వాడు లేకుండా...? 'దు:ఖంలో గొంతు పూడుకుపోయింది విజయకి.

ఆమె భుజం చుట్టూ చేయివేసి, ప్లీజ్, ఇక ఏడవకు, అయినా ఇంక ఎన్నిరోజులని ఎం.ఎస్. పూర్తి కాగానే వాడే ఇండియాకి వెనక్కి వచ్చేస్తాడు. పద ఇంటికి వెళదాం. కారు వైపుగా కదిలాడు సుధాకర్. ఇంటికి వెళుతూంటే, తాను అల్లుకున్న అందమైన ప్రపంచం ఆమె కళ్ల ముందు కదలాడింది.

✤✤✤

'విక్రమ్ టైమ్ అయిపోతోంది. త్వరగా కానీ, ఇదిగో టిఫిన్ బాక్స్, వాటర్ బాటిల్, ఆ...! ఈ చిన్న బాక్సులో డ్రై ఫ్రూట్స్ పెట్టాను, ఎవ్వరికీ పెట్టకుండా నువ్వే తినాలి, సరేనా, ఏంటి వింటున్నావా, ఈ ప్లాస్టిక్ బాక్సులో ఆపిల్ కట్‌చేసి పెట్టాను. ఇంటర్వెల్‌లో తినేయ్, లేకపోతే మరీ నల్లగా అయిపోతాయి.'

'అబ్బా, అమ్మా, అన్ని సార్లు చెప్పకు, నేను అన్నీ తింటానులే, విక్రమ్ పాలు తాగుతూ అన్నాడు, 'పద, పద సందు మొదట్లోకి బస్సు వచ్చేసి ఉంటుంది.' హడావుడిగా అంది.

అమ్మా, నువ్వు బస్సు దాకా రాకమ్మా, నా బ్యాగు, లంచ్ బాక్సు మోసుకొని

నువ్వు వస్తూంటే, మా ఫ్రెండ్స్ అందరూ నవ్వుతున్నారు, నేను వెళతానులే.'

'చాల్చాల్లే, వాళ్లేదో అన్నారని నువ్వు ఊరికే ఫీల్ అవ్వకు, అయినా ఈ స్కూలు బ్యాగు ఎంత బరువుగా ఉందో చూడు, నడు ఓ పక్కటైం అయిపోతోంది.' అంటూ చీర కుచ్చిళ్లు పైపైన సవరించుకొని బ్యాగు, బుట్ట తీసుకొని లిఫ్టు దగ్గరికి వచ్చింది.

అప్పుడే వాకింగు పూర్తి చేసుకొని పైకి వస్తున్న సుధాకర్, 'విజయా, నువ్వు ఇంటికి వెళ్ళు. నేను వాడ్ని బస్సు ఎక్కించి వస్తాను. ఆ బ్యాగు ఇలా ఇవ్వు,' అన్నాడు.

'వద్దులెండి, నడిచి నడిచి అలసిపోయి ఉంటారు కాని, మీ కోసమని గిన్నెలో కాఫీ కలిపి పెట్టాను రెడీగా. కొద్దిగా వెచ్చపెట్టుకొని తాగేసేయండి. నేను విక్కిని బస్సు ఎక్కించి క్షణంలో వచ్చేస్తాను. 'ఎంత చెప్పినా నీ మాట నీదే కదా.' సుధాకర్ విజయ వంక చూస్తూ నవ్వుతూ అన్నాడు.'

'నాన్న బై,' విక్రమ్ హుషారుగా చెయ్యి ఊపుతూ అన్నాడు. బై, లిఫ్టు డోర్ దగ్గరగా వేస్తూ అన్నాడు.

'ఏవండీ వచ్చే నెల ఇంటి అద్దె ఇవ్వకండి. మనం అడ్వాన్సు అడ్జెస్ట్ చేసేద్దాం." కాఫీ తాగుతూ అంది విజయ. ఎందుకు? సుధాకర్ ఆశ్చర్యంగా అడిగాడు, పేపర్ పక్కన పెట్టి. మనం ఇల్లు మారుతున్నాం కాబట్టి, నిదానంగా అంది. ఆమె మాటలకి అదిరిపడుతూ, 'ఏమైంది ఈ ఇల్లు బాగానే ఉందిగా? అన్నాడు. ఆ.. బాగానే ఉంది, కాని పాపం విక్కికి తెల్లారగట్టే ఐ.ఐ.టి కోచింగ్ క్లాసెస్‌కి వెళ్లి రావడం ఇబ్బంది అవుతోంది కదా, అందుకని' అంది. 'ఫ్లాట్‌లో ఉన్న పిల్లలతో కలిసి ఆటోలోనే వెళుతున్నాడు కదా. ఇంకా ఏమిటి నీకు ప్రాబ్లెమ్?' చిరాగ్గా అన్నాడు సుధాకర్.

'అందరి పిల్లలతోనూ నా పిల్లాడ్ని కలపకండి. వాడు జెమ్' గర్వంగా అంది. 'నువ్వు మరీ అతిగా ఊహించుకుంటున్నావు. అయినా విజయా, సొంత ఫ్లాట్ కొనుక్కొని కూడా, విక్రమ్ స్కూల్‌కి దగ్గరని ఇక్కడ అద్దె ఇల్లు తీసుకొని ఉంటున్నాం. ఇప్పుడు కాలేజీకి దగ్గరని ఇంకో చోటుకి మారాలంటే ఎలా' అన్నాడు.

'ఏముంది? ఇంకో అద్దె ఇంట్లోకి మారతాం. అంతే!' సింపుల్‌గా అంది.

'నీకు మరీ అంత మొండితనం పనికిరాదు' విసుగ్గా అన్నాడు.

'ఏవండీ, విక్కికి చిన్న ఇబ్బంది కలిగినా, అది నేను భరించలేను. ఆ విషయం మీకు బాగా తెలుసు. విక్రమ్ విషయంలో కనుక పట్టుదల పట్టిందంటే ఇక ఎట్టి

పరిస్థితుల్లోనూ అది సాధించుకునే వరకు ఇక ఆమె వదిలిపెట్టదు. అది సుధాకర్‌కి చాలాసార్లు అనుభవమైయ్యింది, కాబట్టి అతనింకేం తర్కించలేదు. విక్రమ్‌కి ఇంటర్‌లో స్టేట్ ఫిఫ్త్ ర్యాంక్ వచ్చింది. విజయ ఆనందాన్ని అందరితో పంచుకుని తుళ్లితుళ్లి పడింది. యూనివర్సిటీలో ఇంజనీరింగ్‌కి చేరాడు విక్రమ్.

'ఏవండీ నాలుగేళ్లు ఎంత వేగంగా గడిచాయో కదా. అప్పుడే ఈ ఏడాదితో విక్రమ్ బి.టెక్. అయిపోతోంది.' బెడ్‌రూమ్‌లో ఎగ్జామ్స్‌కి చదువుకుంటున్న కొడుక్కి ఫ్రూట్ జ్యూస్ కలిపి ఇచ్చి, హాల్‌లో ఉన్న సుధాకర్ పక్కకి వచ్చి కూర్చుంటూ అంది విజయ. అవునన్నట్టుగా తల ఊపుతూ ఆమె వంక పరిశీలనగా చూసాడతను.

'ఏంటీ, మరీ అలా చూస్తున్నారు' నవ్వుతూ తల తిప్పుకుంది. విజయా, ఒక్కసారి అద్దంలో నీ ముఖం చూసుకో, కంటి చుట్టూ నల్ల వలయాలు వచ్చి కొద్దిగా చిక్కినట్లుగా కనిపిస్తున్నావు. నలభై దాటుతున్నాయి కదా, ఎందుకైనా మంచిది, ఒక్కసారి డాక్టర్‌కి చూపించి అన్ని టెస్టులు చేయిద్దాం" అన్నాడు ఆమెని తన వైపుకు తిప్పుకుంటూ.

'ఆ... నా ముఖం, నేను గుండ్రాయిలా బాగానే ఉన్నాను కాని, ఏవండీ ముందీ సంగతి తేల్చండి. విక్కి ఫైనల్ ఇయర్ ప్రాజెక్టు ఎక్కడ చేయిద్దాం? కొంచెం పెద్ద కంపెనీ అయితే వాడికి ముందు ముందు మంచి ఎక్స్‌పోజర్ ఉంటుంది కదా' అంది. ఆమె వంక జాలిగా చూశాడు సుధాకర్.

'విజయా, ఏ తల్లిదండ్రులకైనా తమ పిల్లలే సర్వస్వం. అది నేను కాదనను కాని, నువ్వు విక్రమే నీ లోకంగా బతుకుతూ, నీ కోసం ఇంకో అందమైన ప్రపంచం ఉందన్న వాస్తవాన్ని మరిచిపోతున్నావు. విక్రమ్ ఇప్పుడు రెక్కలు వచ్చిన పక్షి త్వరలోనే వాడు తన గూడు వెతుక్కుంటూ ఎగిరిపోతాడు. వాడి ప్రపంచాన్ని అన్వేషిస్తూ వాడు మనల్ని వదలి చాలా దూరం వెళ్లిపోతాడు. ఇప్పటికైనా నువ్వు కళ్లు తెరిచి నీ ప్రపంచాన్ని కనుక నువ్వు సృష్టించుకోలేకపోతే, నువ్వేం అయిపోతావో ఊహించుకోవడానికే నాకు చాలా భయంగా ఉంది.' ఆఖరి మాటలకి అతని గొంతు వణికింది.

'అబ్బ, మీరు మరీనూ, ఏవో ఊహల్లో బతుకుతున్నాను అంటూ నన్నంటారు. కాని నిజానికి, మీరే అతిగా ఆలోచిస్తారు. అయినా నాకేమిటండి, నేను మహారాణిని. నన్ను దేవతలా గుండెల్లో పెట్టుకొని అపురూపంగా చూసుకునే దేవుడిలాంటి మీరున్నారు. 'అమ్మా!' అంటూ అనుక్షణం నా వెనుకాలే తిరుగుతూ, నన్నే గుండెకాయలా చేసుకున్న కొండంత నా కొడుకున్నాడు. నాకు దేవుడిచ్చిన అద్భుతమైన 'వరాలు' మీరు. నాకింత కన్నా ఇంకేం కావాలి. నేను ఇంకేం

ప్రపంచాలు గెలవాలి.” అతని గుండె మీద తలవాల్చి అంది. ‘పిచ్చి విజయా!’ ఆర్ద్రంగా అన్నాడతను, ఆమెని దగ్గరకు తీసుకుంటూ.

‘విజయా, విక్రమ్ అమెరికా వెళ్లాలంటే మనం 20 లక్షలు పైగానే డబ్బు కావాలి. అది పెద్ద సమస్య అని కాదు. కాని ప్రస్తుతం అమెరికాలో ఆర్థిక పరిస్థితులు ఏ మాత్రం బాగోలేవు? అందుకే విక్రమ్‌ని ఇండియాలోనే ఎక్కడైనా ఐ.ఐ.టి.లో ఎం.టెక్. చేయిస్తేనే బావుంటుంది. వాడు కూడా అదే బెటర్ అంటున్నాడు.’

‘భర్త మాటలకి తల అడ్డంగా ఊపుతూ, ‘విక్రమ్ ఎట్టి పరిస్థితిల్లోనూ అమెరికా వెళ్లి తీరాల్సిందే. అక్కడ ఎం.ఎస్. చేయాల్సిందే’ విజయ పట్టుదలగా అంది. విక్రమ్ ‘అమ్మా’ అంటూ ఏదో చెప్పబోయాడు...

అతన్ని కట్ చేస్తూ, ‘విక్కీ నీకేం తెలియదు ఊరుకో ఏవండీ, ఏమైనా వాడు అమెరికా వెళ్లి తీరాలి. పై చదువులు చదివి ప్రయోజకుడవ్వాలి. అంతే... ‘దృఢంగా అంది.

‘ఇంకో ఏడాది ఆగి కనుక వెళితే, అప్పుడు ఇక జాబ్స్‌కి ఏ ప్రాబ్లమ్ ఉండదు, అమ్మా నిజానికి నిన్ను నాన్నని వదలి అంత దూరం వెళ్లలేనేమో అనిపిస్తోంది.’ విక్రమ్ గొంతులో దైన్యం ధ్వనించింది.

‘విక్కి ఊరుకో ముందు అలాగే అనిపిస్తుంది. కాని రోజులు గడిచేకొద్దీ అదే అలవాటైపోతుంది. అక్కడ నీక్కూడా, అలాగే ఇక్కడ నాక్కూడా, కన్నీటి తెర కంట్లో తళుక్కుమని మెరుస్తుండగా, డగ్గుత్తికగా అంది. ‘అమ్మా’ అప్రయత్నంగా విక్రమ్ కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి. ఆ రోజు మొదలైన కన్నీళ్లు ఇంకా ధారగా కారుతూనే ఉన్నాయి. ఇటు భారతదేశంలో ఉన్న విజయ కళ్ళలోంచి, అటు అమెరికా చేరిన విక్రమ్ కళ్లలోంచి.

‘ఏమిటి విజయా, రోజురోజుకి అలా సన్నగా పుల్లలాగ అయిపోతున్నావు? మరీ ఇంత బెంగ పెట్టుకుంటే ఎలా,’ కొంచెం కోపంగా అన్నాడు సుధాకర్.

‘విక్రమ్ లేని లైఫ్‌కి అడ్జస్ట్ అవ్వడం కొంచెం కష్టంగా ఉందండీ’. బేలగా తల వంచుకొని అంది.

‘మరీ చిన్న పిల్లలా మాట్లాడకు. ఇదిగో ఇలా చూడు, తమ భవిష్యత్తును వెతుక్కుంటూ రోజుకి ఎన్నో వేల మంది విద్యార్థులు అమెరికా వెళ్లిపోతున్నారు, మరి అందరు తల్లిదండ్రులు నీలాగే తిండి మానేస్తున్నారా. ఇలా పేషెంట్‌లాగ అయిపోతున్నారా చెప్పు?’ మార్దవంగా అన్నాడు.

కళ్ల ముందు కొడుకు రూపం కదలాడుతుండగా, ‘ఏవండీ విక్రమ్‌ని వదిలి

# స్వాగతం

కాలింగ్ బెల్ మ్రోగింది. హాలులో నిద్రకు జోగుతున్న పల్లవి ఆ శబ్దానికి తుళ్ళిపడి లేచి గబగబా తలుపు తీసింది. జీపు దిగి సురేంద్ర అలసటగా లోపలికి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. కానిస్టేబుల్ అతని లాప్‌టాప్, బ్రీఫ్‌కేస్ లోపలకి తీసుకువచ్చి పెట్టి వచ్చి, 'సార్!' అంటూ సెల్యూట్ చేసాడు వెళ్ళబోతూ గడియారం వంక చూసింది పల్లవి. రాత్రి పన్నెండు దాటుతుంది.

బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి, యూనిఫామ్ విప్పుకుంటున్నాడో లేదో అతని సెల్‌ఫోన్ మ్రోగింది. పల్లవి అన్నం వేడి చేయడానికి వంటింట్లోకి వెళ్ళింది.

'హలో! చెప్పు, వాట్... ఆ... బతికే వుందా, ఆమెకి ఎన్నేళ్ళుంటాయి, ఎంతమంది? లాకప్‌లో పడేసి కుమ్మేయ్యండి నా కొడుకుల్నీ, నేను రేపు వచ్చి చూసుకుంటా' కసిగా సెల్ స్విచ్ ఆఫ్‌చేసి, నైట్ డ్రస్ వేసుకుని మంచం మీదకి వాలిపోయాడు సురేంద్ర. "తలుపులు అన్నీ లాక్‌చేసుకొని వచ్చి పల్లవి అతని పక్కన నిలబడి, "అన్నం తినరా!" అంది కోపాన్ని పంటి బిగువున అణుచుకుంటూ అతని దగ్గర నుంచి సమాధానం లేదు. చేత్తో తట్టింది, "మిమ్మల్నే" అంటూ. అతను అప్పటికే మంచి నిద్రలో ఉన్నాడు.

✤✤✤

తెల్లారి అయిదున్నరకి అలారమ్ మ్రోగుతుంటే మెలకువ వచ్చింది పల్లవికి. నిద్ర మత్తు వదుల్చుకొని పక్కకి చూస్తే అప్పటికే సురేంద్ర పక్క మీద లేడు.

అతడు అయిదు గంటల లోపే జాగింగ్‌కి వెళ్ళాడనటానికి గుర్తుగా అతని నైట్ గౌన్ కింద నేల మీద పడివుంది. పిల్లలిద్దరిని లేపి తయారు చేసి బ్రేక్ ఫాస్ట్, లంచ్ ప్యాక్‌లు ఇచ్చి పంపేటప్పటికీ టైమ్ ఎనిమిది దాటింది.

'పనిమనిషి సత్తెమ్మ ఇంకా రాలేదు. దానికేం వచ్చిందో, వస్తే ఇల్లంతా చక్కగా సర్ది అద్దంలా పెడుతుంది. తన శుభ్రానికి తగ్గట్టుగా నీట్‌గా పని చేస్తుంది. కానీ ఈ మధ్య తరచుగా మానేస్తోంది, విసుగ్గా అనిపిస్తుంది. ఫ్చ్..' అనుకుంది.

అప్పటికి వచ్చాడు సురేంద్ర. స్నానం చేసి యూనిఫాం వేసుకున్నాడో లేదో వరుసగా ఫోన్ కాల్స్‌లు మొదలైయ్యాయి. కొన్ని అటెండ్ అయ్యాడు, కొన్ని అవాయిడ్ చేసి ఆదరబాదరగా టిఫిన్ తినేసి ఆఫీస్‌కు వెళ్ళిపోయాడు. అతని ప్రవర్తన గురించి ఆలోచిస్తూ అలాగే కూర్చుండిపోయింది పల్లవి.

ఒక మంచి మాటలేదు, చూపు లేదు, రోబోలా ప్రవర్తిస్తున్నాడు. ఇతను

నేనెరిగిన సురేంద్ర  కాదు. నన్ను ప్రేమించిన ప్రేమికుడు ఇతను కాదు. ఇతను మొరటుమనిషి మర మనిషి బండరాయిలా పాషాణమైపోయాడు.

పల్లవి మనస్సు భర్తను తలచుకొని భోరుమంటోంది. తన యాంత్రికమైన జీవితం మీద ఆమెకి ఏహ్యత కలుగుతోంది. ఏదో గట్టి నిర్ణయం తీసుకోవాలని, ఆమె బుద్ధి ఆవేశంతో పరుగులు తీస్తోంది.

'దొంగసచ్చినోడు తాగేసి నోటికి వచ్చినట్లు వాగుతున్నాడు. ఏ పోయేకాలం దాపురించిందో ఎధవకి'. ఇంటిగేటు ముందు నిలబడి అరుస్తూ ఎదురింటి పనిమనిషితో గట్టిగా మాట్లాడుతోంది సత్తెమ్మ. తన గొంతువిని, 'ఏమైంది! సత్తెమ్మా? రోజూ లేటేనా... నీ ఇష్టం వచ్చినట్లు వస్తున్నావు?' చిరాగ్గా అంది.

అసలు వేళ తప్పి రాత్రంతా నిద్ర సరిగ్గా లేదేమో, ఆమెకి తలంతా దిమ్ముగా ఉంది, కళ్ళు కూడా విపరీతంగా మండుతున్నట్లుగా ఉన్నాయి.

'కొత్తగా ఏటీ లేదులేండి, మా మావతో రోజూ ఉన్న భాగోతమేకదమ్మా ఫుల్‌గా త్రాగేసి రావడం, అందరికీ వినపడేటట్లు ఇంటిముందు నిలబడి గట్టిగా అరవడం, ఏటీ మావా ఇది లోపలికి రా 'అంటే ఇదిగో సూడమ్మా, కఱ్ఱ పుచ్చుకుని ఎలా బాదేసినాడో'  అంటూ వెనక్కి తిరిగి వీపు చూపించింది.

ఆమె వీపంతా వాతలు తేలి ఎఱ్ఱగా అయినాయి. 'అయ్యో, వాడు మనిషా, పశువా' కోపంగా అంది పల్లవి.

'తెల్లార్లు ఒకటే నొప్పులు, జొరం వచ్చినట్టుందమ్మా, అసలు లేవలేక పోయినాను. పనికి రాగలనో లేదో అనుకున్నాను కాని పిల్లల్ని బడికి పంపేసి అట్టాగే వచ్చాను. నేను ఇంటిపనులు మానుకుంటే నా పిల్లలకి పస్తే కదమ్మా. మొగుడు ఎధవై ఉన్నాడని, నేను ముసుగేసుకొని పడుకుంటే ముద్ద అన్నం ఎట్టా వత్తాది. ముగ్గురు పిల్లలతో నా సంసారాన్ని ఎట్టా సాగుతాందమ్మా'.

సత్తెమ్మ కళ్ళలో నీళ్ళు తుడుచుకుంటూ చీపురు తీసుకొని గదులు ఊడవటం మొదలు  పెట్టింది.

'సత్తెమ్మ జీవితానికి తన జీవితానికి దగ్గర పోలికలు కనిపిస్తున్నాయి తేడా ఏమిటంటే సత్తెమ్మకి ఒంటిమీద దెబ్బలు కనిపిస్తున్నాయి, తన మనస్సు మీద గాయాలు పైకి కనపడటం లేదు. కింద తరగతికి, మధ్యతరగతికి తేడా అదే. అసలు ఆడది ఎప్పుడు మొగుడు నీడనా, ఇంటి మాటునా మనస్సు చూపుకుంటూ బ్రతకాల్సిందేనా, సంసారం అంటే గుట్టు, పిల్లలు, వాళ్ళ భవిష్యత్తు అదే ముఖ్యం అని ఇలా అనుకుంటూ చేతికి ముళ్ళుమీద ముళ్ళు వేసుకుంటూ బంధాన్ని ఇనుప

సంకెళ్ళుగా మార్చుకుంటూ ఒంటరిగా మగ్గిపోవటమేనా, ఆడదాని జీవిత పరమార్థం'. పల్లవి అలాగే ఆలోచిస్తూ కూర్చుండిపోయింది.

✤✤✤

'డాడీ! రెండు రోజులు అయింది నిన్ను చూసి 'సురేంద్ర మీద ఎగిరి కూర్చుంటూ ఆద్య ముద్దుగా అంది. 'డాడీ నేను ఇవాళ బ్యాట్మింటన్ మ్యాచ్‌లో సెమిఫైనల్ విన్నర్ నయ్యాను రేపు ఫైనల్స్' ఆర్య గొప్పగా అన్నాడు. వాడ్ని ప్రేమగా దగ్గరకు తీసుకొని, 'వెరీ గుడ్ ఆర్యా!' కంగ్రాట్యులేషన్స్ అన్నాడు సురేంద్ర.

'ఇవాళ మనం రోబో సినిమాకు వెళదాం. మా ఫ్రెండ్స్ అందరూ వాళ్ళ మమ్మీ, డాడీలతో బోలెడు కొత్త సినిమాలు చూస్తున్నారు. నువ్వేమో మమ్మల్ని ఎక్కడికి తీసుకెళ్ళడం లేదు. డాడీ, ఇవాళ మనం ఎలాగైనా బయటికి వెళ్ళాల్సిందే" అంటూ బుంగమూతి పెట్టింది, ఆద్య.

'అలాగే మై ఏంజిల్. నెక్స్ట్ సండే వెళదాం. ఎందుకంటే నేను ఈవాళ ముంబై వెళుతున్నా, ఒకే చెప్పు మరి డాడికి" అన్నాడు.

'ఒకే డాడీ' ఆద్య తండ్రి బుగ్గ మీద గట్టిగా ముద్దు పెట్టింది, సంతోషంగా...

'మీరిద్దరు ట్యూషన్‌కి వెళ్ళి వచ్చేయండి. అదిగో జీపు కూడా వచ్చేసింది, కమాన్' అంటూ వాళ్ళని పంపేసి అతను బెడ్‌రూమ్‌లోకి వచ్చి చిటికెలో రెడీ అయ్యాడు.

పల్లవి మౌనంగా సూట్‌కేసు సర్దుతోంది.

సురేంద్ర తలతిప్పి ఆమె సీరియస్ ముఖం చూసి 'పల్లవి ఏంటలా ఉన్నావు. నీ ప్రాబ్లమ్ ఏంటీ? ఏదో పడరాని బాధలు పడుతున్నట్టుగా, నేనేదో పెద్ద విలన్ అన్నట్లుగా ప్రవర్తిస్తున్నావు. అసలు నీకా విషయం అర్థం అవుతోందా?' విసురుగా అన్నాడు.

ఆమె అతని వంక తిరస్కారంగా చూసింది. 'నా గురించి, నా వృత్తి గురించి, పెళ్ళికి ముందే నీకు బాగా తెలుసు, మరేంటి చెప్పు? ఎందుకంత కోపం? ఆమె జబ్బపట్టుకుంటూ అన్నాడు. ఆ! అన్ని తెలిసి ఇలా మిగిలిపోయాను' నిర్లిప్తంగా అంది అతని చేతిని దూరంగా నెట్టివేస్తూ. కొంచెం తగ్గి, 'ఏంటి పల్లవీ! నీకు ఇంకా ఏం కావాలి, ఎందుకీ అసంతృప్తి, ఎందుకీ మౌనం చెప్పు', దగ్గరగా వస్తూ అన్నాడు.

'నీకు తెలియదా!' ఆమె కోపాన్ని డామినేట్ చేస్తూ, దు:ఖం నెమ్మదిగా బయటికి తొంగి చూస్తోంది. ఆమె కళ్ళలో నీళ్ళు చూసి అతను కరిగి

‘ఐ కెన్ అండర్‌స్టాండ్, ఈ ఉద్యోగం అంతే అసలు ప్రోబ్లమ్ టైమ్ కానీ అది నా చేతుల్లో లేదు. ప్రతి క్షణం ఒక సవాల్. నేను నా డ్యూటీలో ఒక్క క్షణం ఆదమరచి ఉన్నా నేరస్థుడు సెకండులో తప్పించుకుపోతాడు. ఎంతో కష్టపడి సివిల్స్ వ్రాసి నేనెంతో ఇష్టపడి ఎంచుకున్న ప్రొఫెషన్ ఇది. నువ్వు నన్ను అర్ధం చేసుకొని అండగా ఉంటావనుకున్నాను. కానీ ఇలా నాపై కోపాన్ని పెంచుకుంటూ, అలుగుతూ, అనుక్షణం మన జీవితాన్ని నరకంగా మారుస్తావనుకోలేదు” ఆవేదనగా అన్నాడు.

‘ఏంటీ నేనా! నేనా  నరకాన్ని చేస్తున్నది’ ఆవేశంగా అంది పల్లవి.

‘అవును! ముమ్మాటికి నువ్వే’ గట్టిగా అన్నాడతను.

‘కాదు అంతా నీవల్లే’ అరిచింది అసహనంగా

‘పల్లవీ, ఎందుకలా అరుస్తావు’ ఇటు చూడు కొంచెం కూల్‌గా ఆలోచించు. నిజానికి ఏ మనిషి ఫర్‌ఫెక్ట్‌గా ఉండడు, ఏదో ఒక లోపం లేని వాడు అసలు మనిషే కాడు. నేను షూస్ విప్పిన వెంటనే సాక్స్‌ని లోపల వేయకపోయినా తీసుకెళ్ళి స్టాండ్ పైన పెట్టకపోయినా నీకు కోపం వస్తుంది. నైట్ డ్రెస్ విప్పగానే, వాషింగ్ మెషీన్‌లో వేయకపోయినా, రాత్రికి ఓ రెండుగంటలు లేట్‌గా వచ్చినా నువ్వు సహించలేవు. అంతా చాలా ప్లాన్‌డ్‌గా ఫెర్‌ఫెక్ట్‌గా ఉండాలంటావు. కాని అది ఒక్కోసారి జరుగకపోవచ్చు. నువ్వేమో పొరపాటున కూడా ఎడ్జస్ట్ అవ్వవు. ఎప్పుడు ఏదో టెన్షన్ నీకు.

ఒక్కసారి నీ ఆలోచనల్లోంచి నువ్వు బయటికి వచ్చి పక్కకు చూడు. ఇంతసేపు మనం ఇలా గొడవ పడేకన్నా మన దగ్గర ఉన్న ఈ కొంచెం టైమ్‌లో, మనం సంతోషంగా ఎంతో సన్నిహితంగా ఉండొచ్చు. రీ ఫ్రెష్ అవ్వచ్చు, కానీ నీకా ఆలోచన రాదు, నీకది ఎంత చెప్పినా అర్ధం కాదు. నిన్న నువ్వు అలా అన్నావు? మొన్న ఎందుకు అలా చేసావు, ఎందుకు యూనిఫాం అలా కిందపడేసావు?’ నీకు నీట్‌నెస్ తక్కువ నిన్న రాత్రి లేట్‌గా వచ్చావు. మొన్న నాకు చెప్పకుండా ఆఫీస్‌కి వెళ్ళిపోయావు పిల్లల్ని ముద్దు చేయవు. ఇలా ఎప్పుడూ ఏదో ఒకటి అంటూ నువ్వు సుఖంగా ఉండకుండా, నన్ను ప్రశాంతంగా ఉండనివ్వకుండా మూడ్ పాడుచేస్తావు, ఎలా పల్లవి, నీతో” అన్నాడు.

అతని ఆరోపణలకి పల్లవి మైండ్ బ్లాంక్‌గా అయిపోయింది. తను అనాల్సినవన్నీ అతను తిరిగి రివర్స్‌లో అంటూంటే ఆమెలో ఏదో ఫ్రస్టేషన్. ఆవేశం ఆమెలో తన్నుకురాగా, ఏదో అనబోయేంతలో పిల్లల్ని దింపిన జీపు వచ్చి ఇంటి ముందు ఆగింది. కానిస్టేబుల్ సెల్యూట్ చేసి గబాగబా సురేంద్ర సామాను,

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Swagatam**

* * *